క్లుప్తంగా

కార్మికుల సమ్మె సఫలం

మణుగూరురూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ కార్మికులు కంపెనీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ముగిసింది. ఎనిమిది రోజులుగా సమ్మె కొనసాగగా.. మంగళవారం యాజమాన్యంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులకు వేతన ఒప్పందం అమలుకు, సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించింది. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. ఈ మేరకు సమ్మెకు నాయకత్వం వహించిన కార్మిక సంఘం ఏఐటీయూసీ బాధ్యులు వివరాలు వెల్లడించారు. చివరిరోజు సమ్మె శిబిరాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు లక్ష్మినారాయణ సందర్శించారు. సమ్మె కార్యక్రమంలో ప్రీమియర్ ఎక్స్ప్లోజివ్ కార్మికులు ఎర్రయ్య, యాకయ్య, రాములు, అశోక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

గుండాల: కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా వ్యవహరించిన గుండాల తహసీల్దార్ నాగ దివ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్కలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని జిల్లా అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ తహసీల్దార్ ప్రొటోకాల్ పాటించడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ కోరం సీతారాములు, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేయాలి

మణుగూరురూరల్: ప్రతి ఒక్కరూ కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సమితిసింగారం పంచాయతీ సర్పంచ్ బచ్చల భారతి సూచించారు. సమితిసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పర్శ లెప్రసీ అవగాహన ఉద్యమాన్ని సర్పంచ్ భారతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముదురు రాగి రంగు మచ్చలుండి స్పర్శ లేని వారిని పీహెచ్‌సీకి తరలించాలని ఆశాకార్యకర్తలకు సూచించారు. అనంతరం స్పర్శ లెప్రసీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దయామని, రాంప్రసాద్, పుష్ప, ప్రమీల, సుమ, పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలు పెంచండి

దమ్మపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సదుపాయాలని పెంచాలని కోరుతూ స్థానిక తహసీల్‌లో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు యార్లగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు, 30 పడకలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, ధర్మ, బెజవాడ రాము, జానీబేగం, శాంతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు రేగా విష్ణు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మండలంలోని పలు గ్రామాల యువతకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కల్యాణపురం, మిట్టగూడెం, బట్టీలగుంపు, రాంనగర్, పిచుకలతండా, అమ్మగారిపల్లి, అణుశక్తినగర్, అశ్వాపురం(సెక్యూరిటీ), ఆమెర్ద గ్రామాలలో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, చుంచు రామ్మూర్తి, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, నయీం, దుర్గారావు, కనీష్, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో మంగళవారం శ్రీ ఆంజనేయ విగ్రహాన్ని మంత్రోచ్ఛరణల మధ్య ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన గగినేని శ్రీనివాసరావు–భారతి దంపతులు, మురుగొండ, శివ రామకృష్ణ దంపతుల ఆర్థిక సహాయంతో నిర్మితమైన క్షేత్ర పాలకుడిగా, గ్రామ రక్షకుడిగా భావించే అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. అర్చకులు రాఘవ శర్మ, యశ్వంత్ శర్మ, భీష్మాచార్యుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం, సకల దేవతా మండల దీపారాధన హోమం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, హనుమాన్ చాలీసా చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ రహదారికి మోక్షమెన్నడు?

- ఇబ్బందిగా మారిన రాకపోకలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చినరావిగూడెం వద్ద కోతకు గురైన బీటీ రోడ్డు

మణుగూరురూరల్: మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ ప్రధాన రహదారి నుంచి కట్టుమల్లారం, కమలాపురం మీదుగా చినరాయిగూడెం వెళ్లే రహదారి అంతా గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం చిన్నరాయిగూడెం, కమలాపురం, కట్టుమల్లారం, ఉడతానేనిగుంపు గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిపై ఈ రహదారి మార్గానే మణుగూరు పట్టణ ప్రధాన సెంటర్‌కు, ప్రభుత్వ కార్యాలయాలకు వస్తూ వెళ్తుంటారు. చిన్నరాయిగూడెం మొదలుకుని పట్టణ ప్రధాన రహదారి సమీప పూజారినగర్ వరకు ఆటోలో, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయా గ్రామాల్లో ఎవరికైనా అనారోగ్యం వచ్చినా.. గర్భిణులు స్త్రీలు ఉన్నా.. పట్టణంలోని ఆస్పత్రులకు రావాలంటే వారు పడే అవస్థలు వర్ణనాతీతం. ఈ రహదారి సమస్య గురించి ఆయా ప్రాంతాల ప్రజలు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రహదారిపై ఏర్పడిన గుంతల్లో పడి పలువురు గాయాలపాలైన సంఘటనలు లేకపోలేదు. ఇక వర్షాకాలం వస్తే రోడ్డు దుస్థితి చెప్పనవసరం లేదు.

పట్టింపులేనితనం..

మణుగూరు నుంచి చినరావిగూడెం వెళ్లే రోడ్లను మరమ్మత్తులు చేయించాలని కమలాపురం, చినరావిగూడెం ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా.. ప్రయోజనం లేకుండా పోయింది. ఆ గ్రామాల వారు ఈ దారుల్లో ఇసుక ట్రాక్టర్లు నిరంతరం తిరగడం వల్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అధికారులకు తెలపగా.. అధికారులు మాత్రం మితిమీరిన వేగంతో తిరుగుతున్న ఇసుక ట్రాక్టర్లను నియంత్రించడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. అభివృద్ధి పనులకు ఎన్నిసార్లు నిధులు మంజూరైనా.. ఈ రహదారి మరమ్మతులకు మాత్రం నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం లేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ దారికి నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదని అధికారులను ప్రశ్నించగా.. మాకేమి సంబంధం లేదు.. ప్రజాప్రతినిధులు ఎలా చెబితే అలా నడుచుకోవడమే మా బాధ్యత అని తేల్చి చెబుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు.

మరమ్మతులు చేయాలి



అంబేడ్కర్ సెంటర్ నుంచి కమలాపురం మీదుగా చినరావిగూడెం వెళ్లాలంటే రోడ్లు బాగాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయించాలని కోరుకుంటున్నాం. ప్రజల ఇబ్బందులను గుర్తించి అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన రోడ్లను వేయించాలి.

– ఉసికెల కొండయ్య

ఇబ్బంది పడుతున్నాం



ప్రధాన రహదారి నుంచి 220 కేవీ సబ్ స్టేషన్, ఉడతానేని గుంపు మీదుగా చినరాయిగూడెం వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా ఉంది. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. రోడ్డు బాగుచేయాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరగా మరమ్మతులు చేయించాలి.

– మారెడ్ల భాస్కర్‌రెడ్డి

125 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వరరెడ్డి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో డిసెంబర్ నెలకు గాను 125 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొలుత తనకు డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ బాధ్యతలు అప్పగించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక సాధారణ ఉద్యోగిగా సంస్థలో జీవితం ప్రారంభించిన తాను డైరెక్టర్ స్థాయికి రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మణుగూరు ఏరియా ఉత్పత్తి ఉత్పాదక విషయాలను గురించి తెలిపారు. జనవరి నెలలో మణుగూరు ఏరియాలో 10.56 లక్షల టన్నులకుగాను 13.25లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 125 శాతం ఉత్పత్తి సాధించినట్లుతెలిపారు. ఏడాది వార్షిక లక్ష్యం ప్రోగ్రెసివ్ ఉత్పత్తి 95.07లక్షల టన్నులకుగాను 104.64లక్షల టన్నులు సాధించి 110శాతం సాధించనట్లు తెలిపారు. అదే విధంగా ప్రోగ్రెసివ్ 33.95లక్షల టన్నులు రవాణా చేసినట్లు, బీటీపీఎస్‌కు 3.47లక్షల టన్నులు బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ సైతం 15.00లక్షల క్యూబిక్ మీటర్లకుగాను 15.66లక్షల క్యూబిక్ మీటర్లు తీసి 104శాతం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, డీజీఎం ఐడీఈ వెంకట్రావు, ఏజీఎం నాగేశ్వరరావు, ప్రాజెక్టు అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, డీజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, మెడికల్ అధికారి మేరి కుమారి, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి జీఎం పూజలు

సింగరేణి కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా నియమితులైన ఏరియా జీఎం వెంకటేశ్వరరెడ్డి మంగళవారం శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజీఎం నర్సిరెడ్డి, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసాచారి, ఊటుకూరు సత్యనారాయణ, నాని, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయించాలి

అశ్వారావుపేటరూరల్: దబ్బతోగు సాగునీటి ప్రాజెక్ట్ కాలువల్లో తక్షణమే పూడిక తీయించాలని బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం అశ్వారావుపేట మండలం దబ్బతోగు వద్ద ఉన్న ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అలాగే ప్రాజెక్ట్ కింద సాగులో ఉన్న మిర్చి, వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రాజెక్ట్ కుడి కాలువ మట్టితో పూడుకుపోయి, పిచ్చి చెట్లతో నిండిపోయిందని దాంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. తూము వద్ద నుంచి సుమారు 100 మీటర్ల వరకు అలుగు నుంచి నీళ్ల వెళ్లేందుకు పెట్టిన పైపులు పూడుకుపోయినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేల్పుల నాగమహేశ్వరరావు, జక్కుల చిన్ని, గొల్లమందల పెంటయ్య ఉన్నారు.

ఏసీడీ చార్జీలను రద్దు చేయాలి

విద్యుత్ వినియోగదారులపై విధించిన ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నాలు చేపట్టారు. విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడించి నినాదాలు చేశారు. అక్కడి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కాగా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లిలో ఇదే సమస్యపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజలపై భారం మోపే ఏసీడీ విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే యోచనను మానుకోవాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు



దమ్మపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు



దుమ్ముగూడెం: లచ్చిగూడెం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్డీ నాయకులు



ములకలపల్లి: సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని గోదావరి తీరంలో ఆదివారం ఓ వ్యక్తి గల్లంతు కాగా, మణుగూరు రెవెన్యూ, పోలీసులు సిబ్బంది గాలింపు చేపడుతుండడంతో మంగళవారం మృతదేహం లభ్యమైంది. సత్తుపల్లికి చెందిన సింహాద్రి శ్రీనివాసరావు(40) మణుగూరు మండలం కొట్టకట్టలోని నర్సింహారావు ఇంట్లో జరిగిన పండుగకు వచ్చాడు. ఈక్రమంలో మల్లేపల్లి పార్కు సమీపాన గోదావరి తీరంలో స్నానానికి వెళ్లి గల్లంతుకాగా, మంగళవారం మృతదేహాన్ని వెలికితీసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రేగాపై వ్యాఖ్యలు సరికాదు

గుండాల: సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుపై చేసిన అణుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పొత్తులపై బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం మేరకు నడుస్తున్నామని, కానీ రేగాపై వ్యక్తిగత దూషనలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని పేర్కొన్నారు. సాబీర్‌పాషా బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చిరాగ్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులకు హెచ్ఎం మోహన్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన చిరాక్ ఫౌండేషన్‌కు హెచ్ఎం అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రాము, శాంతికుమారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి 'చేయూత'

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బొజ్జా సాయి అనే నిరుపేద యువకుడికి అదే గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ రూ.5 వేల ఆర్థికసాయమందించి అండగా నిలిచింది. తల్లిదండ్రులను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాయికి చేయూత ట్రస్ట్ చేయూతనిచ్చింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, కైపు రామచంద్రారెడ్డి, గాదె నర్సిరెడ్డి, ఎం.లక్ష్మీరెడ్డి, కె.నాగిరెడ్డి, జె.మల్లారెడ్డి, పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని వీడితే నష్టం లేదు

గుండాల: కాంగ్రెస్ పార్టీని కాదని స్వలాభాల కోసం టీఆర్ఎస్‌లోకి వెళ్లినంత మాత్రాన కాంగ్రెస్‌కు జరిగే నష్టం ఏమీ లేదని ఆ పార్టీ జిల్లా నాయకులు పడిగ సమ్మయ్య అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండలంలోని మర్కోడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ మర్కోడు అధ్యక్ష పదవి పొందిన అంజయ్య, నర్సింహారావు, పూనెం నర్సింహారావులు బీఆర్ఎస్‌లోకి వెళ్లడం తమ పార్టీకీ నష్టం లేదన్నారు. మర్కోడు గ్రామ అధ్యక్షుడిగా తాళ్లపల్లి చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో హరికృష్ణ, ఏర్పు నాగేష్, సుతారి కృష్ణ, ముప్పిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా..



కోటకట్టలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట, ఆదర్శనగర్‌లోని సీసీరోడ్డు సైడు కాలువల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఈ అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కరించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పట్టణంలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు పచ్చదనం పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. పట్టణ ప్రగతి, హరితహారం వంటి కార్యక్రమాలతో పట్టణ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు, నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మినీ పార్కులు, సుందరీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టి సర్వాంగ సుందరంగా మణుగూరు పట్టణాన్ని రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణ, టీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల బాలికలు టీశాట్ నిర్వహించిన పాఠాల బోధన ప్రత్యక్ష ప్రసారంలో ప్రతిభ చాటారు. పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని బి.దీక్షిత, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.సౌమ్యలు మంగళవారం హైదరాబాద్‌లో టీశాట్ ప్రత్యక్ష ప్రసారంలో తమ బోధన చేశారు. దీక్షిత ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో సహజ ఇంద్రధనస్సు నిర్మాణం, కాంతి వ్యాప్తిపై బోధించగా.. సౌమ్య బోటనీ సబ్జెక్ట్‌లో పుష్పించే మొక్కలలో లైంగిక పునరుత్పత్తి అంశాలపై బోధించారు. ఇద్దరు విద్యార్థినిలు ఇంగ్లీషులో బోధిస్తున్న తీరు అబ్బుర పరిచింది. టీశాట్ ప్రోగ్రాంలో ప్రతిభ చాటిన విద్యార్థినులను ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఏపీఓ జనరల్ ఆర్‌సీవో డేవిడ్ రాజులు అభినందించారు. విద్యార్థినులకు ప్రిన్సిపాల్ దేవదాసు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నిధులు కేటాయించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వేలైన్ నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా తెలంగాణ ఎంపీలు చొరవతీసుకోవాలని అన్నారు. భద్రాచలం పట్టణాన్ని రామాయణం సర్క్యూట్‌లో చేర్చి, భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలం ముంపు సమస్యను పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

బూర్గంపాడు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. మండల కేంద్రం బూర్గంపాడులోని గౌతమిపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, సోహెల్‌పాషా, గొనెల నాని, అప్పల నాయుడు, జక్కం సర్వేశ్వరరావు, కైపు శ్రీనివాస రెడ్డి, బాలకృష్ణ, మందా ప్రసాద్, కేసుపాక బొందయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



ఆదివాసీలకు దుస్తులు, సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

చర్ల: మండలంలోని పులిగుండాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొండెవాయి గ్రామంలో ఆదివాసీలకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో దుస్తులు, దోమతెరలు, సోలార్ లైట్లను పంపిణీ చేశారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్, చర్ల పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్ ఆదేశాల మేరకు గ్రామంలోని 280 మందికి దుస్తులు, సోలార్ లైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ డీఎస్పీ సోంజింగ్ భగత్ మాట్లాడారు. పోలీసుశాఖ ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తోందని, సంఘ విద్రోహశక్తులకు ఎట్టిపరిస్థితుల్లో అవకాశం ఇవ్వొద్దని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటప్పయ్య, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి

దుమ్ముగూడెం: విద్యార్థులు సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని రాణించాలని లక్ష్మీనగరం సర్పంచ్ సరియం రాజమ్మ అన్నారు. మంగళవారం లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం నిర్వహిస్తున్న ఫీల్డ్ కోఆర్డినేటర్‌లు, కౌన్సిలర్‌లతో మాట్లాడి కార్యక్రమ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం పంపిణీ చేసిన స్వెట్టర్‌లు, దుప్పట్లను విద్యార్థులకు అందచేసిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌యం దనసర నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దమ్మపేట: మండల పరిధిలోని గణేష్‌పాడు గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం నాగుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో గణేష్‌పాడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయుర్వేద వైద్యురాలు శోభారాణి గ్రామ పరిధిలోని 109 మంది రోగులను పరీక్షించారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహర నియమాలను తెలియజేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, కార్యదర్శి విజయ్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మలుపులు



మండల పరిధిలోని నెల్లిపాకబంజర గ్రామంలో జిన్నింగ్ మిల్లు వద్ద మొండికుంట-సారపాక ప్రధాన రహదారిపై రెండు మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి హెచ్చరికబోర్డులూ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ఇక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగాయి.. ఎందరో గాయపడ్డారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎదురురెదురుగా వచ్చే వాహనాలు మూల మలుపు ప్రమాదాలకు గురైనట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. - అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ, అశ్వాపురం
ఫోన్ నంబర్: 9441435367